# ప్రజాస్వరం

PRAJASWARAM తెలుగు దినపత్రిక

**Bullet Edition**

సోమవారం 28 ఏప్రిల్ 2025 www.prajaaswaramdaily.com 2 pm


# 16 యూట్యూబ్ చానళ్లపై నిషేధం

## పహల్గాం ఉగ్రదాడి ఘటన తర్వాత రెచ్చగొట్టేలా ప్రచారం

ఢిల్లీ : పహల్గాం ఉగ్రదాడి ఘటన నేపథ్యంలో.....పాకిస్థాన్ కు చెందిన 16 యూట్యూబ్ ఛానళ్లపై కేంద్రం నిషేధం విధించింది. కేంద్ర హోంశాఖ సిఫారసు మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రకటించింది. అందులో పలు న్యూస్ ఛానళ్లు, స్పోర్ట్స్ ఛానళ్లు కూడా ఉన్నాయి. నిషేధం విధించిన ఛానళ్లలో డాన్ న్యూస్ , సమా, జియోన్యూస్ తదితర ఛానళ్లు ఉన్నాయి. పహల్గాం ఉగ్రదాడి ఘటన తర్వాత రెచ్చగొట్టే ప్రచారం చేయటమే కాకుండా మతపరంగా సున్నితమైన కంటెంట్ తోపాటు తప్పుదారి పట్టించే సమాచారాన్ని ప్రసారం చేయటం, భారత్ , సైనిక బలగాలకు వ్యతిరేకంగా ప్రచారం చేస్తున్నట్లు కేంద్రం పేర్కొంది. ఉగ్రదాడి తర్వాత భారత్ పాకిస్థాన్ కు వ్యతిరేకంగా ఇప్పటికే పలుచర్యలు చేపట్టింది. సింధూనదీ జలాల ఒప్పందం పక్కనపెట్టడంతోపాటు పాక్ వీసాలను రద్దు చేసింది. పాక్ దౌత్యవేత్తలకు సమన్లు పంపింది. అటారీ-వాఘా సరిహద్దు గేట్లను మూసివేసింది. తాజాగా పాకిస్థాన్ కు చెందిన 16యూట్యూబ్ ఛానళ్లపై కొరఢా ఝుళిపించింది. మరో




వైపు..... ఉగ్రదాడి ఘటనకు సంబంధించిన రిపోర్టింగ్ పై బీబీసీకి కేంద్రం పలు సూచనలు చేసింది. ఉగ్రవాదులను మిలిటెంట్లుగా పేర్కొనటాన్ని తీవ్రంగా ఆక్షేపించింది. బీబీసీ ప్రసారాలను పర్యవేక్షించనున్నట్లు కేంద్రం తెలిపింది

# లోకాయుక్త, ఉపలోకాయుక్త ప్రమాణం

### జస్టిస్ ఎ. రాజశేఖర్రెడ్డి, బి.ఎస్. జగ్జీవన్ కుమార్ ప్రమాణ స్వీకారం

### పాల్గొన్న సీఎం రేవంత్ రెడ్డి, గవర్నర్

హైదరాబాద్ : హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో లోకాయుక్త , ఉపలోకాయుక్తల ప్రమాణ స్వీకారం జరిగింది. లోకాయుక్తగా జస్టిస్ ఎ.రాజశేఖర్రెడ్డి , ఉపలోకాయుక్తగా బి.ఎస్.జగ్జీవన్ కుమార్ సోమవారం గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ సమక్షంలో ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి , పలువురు ప్రముఖులు హాజరయ్యారు.

జస్టిస్ ఎ.రాజశేఖర్రెడ్డి , బి.ఎస్.జగ్జీవన్ కుమార్లు తమ విధులను నిష్పక్షపాతంగా నిర్వర్తిస్తూ, రాష్ట్రంలో అవినీతిని నిరోధించడానికి కృషి చేస్తారని ఈ సందర్భంగా హాజరైన వారు ఆశాభావం వ్యక్తం చేశారు. వీరి నియామకం రాష్ట్ర పాలనలో మరింత పారదర్శకత , జవాబుదారీతనాన్ని పెంచుతుందని భావిస్తున్నారు. ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమం రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగంలో ఒక ముఖ్యమైన ఘట్టంగా పరిగణించబడుతోంది. లోకాయుక్త , ఉపలోకాయుక్తల నియామకంతో ప్రజలు తమ సమస్యలను , అవినీతికి సంబంధించిన ఫిర్యాదులను నిష్పక్షపాతంగా విచారించే ఒక ఉన్నత స్థాయి వేదికను ఆశించవచ్చు.





# మాటలు మార్చేది కేసీఆరే

## ఖజానా ఖాళీ చేసి మాపై నిందలా..? : కేసీఆర్‌పై మండిపడ్డ సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్: "కేసీఆర్ .. ఖజానాను ఖాళీ చేసి మాపై నిందలు వేస్తున్నారని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. బీఆర్ ఎస్‌ను నమ్మే స్థితిలో ప్రజలు లేరన్నారు. కేసీఆర్ అభద్రతాభావంతో మాట్లాడారన్నారు. ఆయన ప్రసంగంలో స్పష్టత లేదని, రాహుల్‌గాంధీకి, తనకు మధ్య గ్యాప్ ఉందనడం అవాస్తవమని తెలిపారు. రాహుల్‌కు, తనకు ఉన్న అనుబంధం ప్రపంచానికి చెప్పనవసరం లేదన్నారు. అవసరాలను బట్టి కేసీఆర్, మోదీ మాటలు మారుస్తున్నారని మండిపడ్డారు. దేశానికి ఇందిరాగాంధీ లాంటి ప్రధాని కావాలి అని రేవంత్‌రెడ్డి అన్నారు. ఎల్కతుర్తిలో జరిగిన బీఆర్ఎస్ రజతోత్సవ సభపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించారు. ఆయన ప్రసంగం అక్కసుతో కూడుకున్నదని ఆరోపించారు. "ఎమ్మెల్యేలు ప్రజల్లోకి వెళ్లాలి. ఎమ్మెల్యేలు వెళ్తేనే.. ప్రజల్లోకి పథకాలు వెళ్తాయి. పార్టీలో ఓపికగా ఉంటే పదవులు వస్తాయి. ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే పార్టీ నేతలే నష్టపోతారు" అని రేవంత్ హెచ్చరించారు.

**జానారెడ్డితో సీఎం భేటీ..**

జానారెడ్డితో సీఎం రేవంత్‌రెడ్డి భేటీ అయ్యారు. మావోయిస్టులతో చర్చల కోసం శాంతి కమిటీ ఏర్పాటు చేస్తామని ఈ సందర్భంగా సీఎం అన్నారు. మావోయిస్టుల అంశంపై జానారెడ్డి, కే కేశవరావు పార్టీలో చర్చిస్తారని తెలిపారు.

# యూట్యూబ్ ఇండియా ఎండీగా గుంజన్ సోనీ



వాషింగ్టన్ : ప్రముఖ వీడియో స్ట్రీమింగ్ దిగ్గజం యూట్యూబ్... ఇండియా కంట్రీ మేనేజింగ్ డైరెక్టర్‌గా గుంజన్ సోనీని నియమించినట్లు సోమవారం ప్రకటించింది. వ్యాపారం, టెక్నాలజీ, మార్కెటింగ్, ఇ-కామర్స్ రంగాల్లో రెండు దశాబ్దాలకు పైగా నాయకత్వ అనుభవం కలిగిన గుంజన్, భారత్‌లో యూట్యూబ్ వృద్ధి, ఆవిష్కరణల బాధ్యతలను చేపట్టనున్నారు. ఈ నియామకంపై యూట్యూబ్ ఆసియా పసిఫిక్ వైస్ ప్రెసిడెంట్ గౌతమ్ ఆనంద్ మాట్లాడుతూ, "భారతదేశంలో యూట్యూబ్ ప్రయాణం ఎంతో ఉత్సాహంగా, శక్తివంతంగా సాగుతోంది. అపారమైన సృజనాత్మకత, సామర్థ్యం ఉన్న దేశమిది. మా తదుపరి వృద్ధి దశకు మార్గనిర్దేశం చేసేందుకు అనుభవజ్ఞురాలైన గుంజన్‌కు స్వాగతం పలుకుతున్నందుకు సంతోషంగా ఉంది" అని తెలిపారు. తన నియామకంపై గుంజన్ సోనీ స్పందిస్తూ, "భారతీయ క్రియేటర్ ఎకానమీకి ఎంతో కాలంగా మద్దతు ఇస్తున్న యూట్యూబ్‌లో చేరడం గౌరవంగా, ఉత్సాహంగా ఉంది. భారతదేశవ్యాప్తంగా క్రియేటర్లను యూట్యూబ్ శక్తివంతం చేస్తున్న తీరు, కమ్యూనిటీలను కలుపుతున్న విధానం స్ఫూర్తిదాయకం. ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకులను చేరుకోవడంలో యూట్యూబ్ పాత్రను మరింత మెరుగుపరచడానికి కృషి చేస్తాను" అని అన్నారు.

# ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీ వైస్ చైర్మన్‌గా శాంతి కుమారి

### తాజాగా ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

హైదరాబాద్ : సీఎస్ శాంతి కుమారికి కీలక బాధ్యత అప్పగించారు. డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ(ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీ) వైస్ చైర్మన్ గా శాంతి కుమారి పేరును ప్రభుత్వం ప్రకటించింది. సీఎస్ గా పదవీ విరమణ తర్వాత.. ఆమె ఈ బాధ్యతలు స్వీకరించనున్నారు. ఈ మేరకు ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ డీజీగా అదనపు బాధ్యతలు అప్పగించింది.

నిన్న తెలంగాణ ప్రభుత్వ నూతన ప్రధాన కార్యదర్శిగా సీనియర్ ఐఏఎస్ అధికారి కె. రామకృష్ణారావును నియమించింది. ప్రస్తుత సీఎస్ శాంతి కుమారి ఈ నెల 30 పదవీ విరమణ చేయనున్న నేపథ్యంలో తాజాగా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం రామకృష్ణారావు ఆర్థిక శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. కొత్త సీఎస్ నియామకంపై గత కొంత కాలంగా ప్రభుత్వం తీవ్ర కసరత్తు చేసింది. సీనియారిటీ జాబితా ప్రకారం.. రామకృష్ణారావుతోపాటు ఆరుగురు అధికారులు రేసులో నిలిచారు. వారందరి పేర్లను పరిశీలించిన రాష్ట్ర ప్రభుత్వం సమర్థత, అనుభవాన్ని దృష్టిలో ఉంచుకొని 1991 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన రామకృష్ణారావును సీఎస్‌గా నియమించాలని నిర్ణయించింది.



# హైదరాబాద్ పాతబస్తీలో ఈడీ సోదాలు

హైదరాబాద్ : భూదాన్ భూముల వ్యవహారంలో హైదరాబాద్ పాతబస్తీలో ఈడీ అధికారుల సోదాలు నిర్వహిస్తున్నారు. పాతబస్తీ యాకుత్ పురా, సంతోష్ నగర్ లో ఈడీ సోదాలు చేస్తోంది. ఈఐపీఎల్ కంపెనీ.. పలువురు ఐఏఎస్ , ఐపీఎస్ లకు భూములు విక్రయించింది. ఈఐపీఎల్ కంపెనీకి సుకూర్ బినామీగా ఉన్నట్లు ఈడీ ఆరోపించింది. ఈ మేరకు... సుకూర్ , బంధువు షర్ఫన్ , మరో ఇద్దరి ఇళ్లలో ఈడీ సోదాలు చేస్తోంది. ఇప్పటికే ఈ కేసులో అప్పటి రంగారెడ్డి కలెక్టర్ అమోయ్ కుమార్ , మహేశ్వరం తహసీల్దార్ ను ఈడీ విచారించింది.



# కేరళ ముఖ్యమంత్రి కార్యాలయానికి బాంబు బెదిరింపు

**కేరళ సీఎంఓతో పాటు సచివాలయానికి ...**
**కొచ్చి ఎయిర్‌పోర్టుకు సైతం ఇదే మాదిరి బెదిరింపులు**
**ఆయా ప్రదేశాలకు చేరుకుని బాంబ్ స్క్వాడ్, పోలీస్ బృందాలు గాలింపు చర్యలు**
**గత రెండు వారాలుగా కేరళలోని ప్రభుత్వ ఆఫీస్‌లకు వరుస కాల్స్**

తిరువనంతపురం : కేరళ ముఖ్యమంత్రి కార్యాలయంతో పాటు సచివాలయానికి నేడు బాంబు బెదిరింపులు వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. అటు, కొచ్చి ఎయిర్‌పోర్టుకు సైతం ఇదే మాదిరి బెదిరింపులు వచ్చినట్లు సంబంధిత అధికారులు తెలిపారు. దీంతో బాంబ్ స్క్వాడ్, పోలీస్ బృందాలు ఆయా ప్రదేశాలకు చేరుకుని గాలింపు చర్యలు చేపట్టాయి. రెండు వారాలుగా కేరళలోని ప్రభుత్వ కార్యాలయాలకు వరుసగా బాంబు బెదిరింపు కాల్స్ వస్తున్నాయి. ఇలా రెండు వారాల్లో ఏకంగా 12 బాంబు బెదిరింపు కాల్స్ వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. కేరళ హైకోర్టు సహా జిల్లా కలెక్టరేట్‌లు, రెవెన్యూ డివిజనల్ కార్యాలయాలకు బెదిరింపు మెయిల్స్ వచ్చాయి. నిన్న తిరువనంతపురం విమానాశ్రయంతో పాటు నగరంలోని పలు ప్రముఖ హోటళ్లకు బెదిరింపు మెయిల్స్ వచ్చినట్లు తెలిపారు. మే 2న రాష్ట్రంలో ప్రధాని మోదీ పర్యటించనున్నారు. ఈ నేపథ్యంలో ఈ నకిలీ కాల్స్ పై పోలీసులు దర్యాప్తు వేగవంతం చేశారు.